


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

**హృదయానికీ, జ్ఞానానికీ** చెలియలి కట్టలు లేవు. ఎంత తెలుసుకున్నా మొదటి దానిలో ఇంకా ఖాళీ ఉంటుంది. ఎంత రెండోది ఇంకా మిగిలే ఉంటుంది. మరి పరిపక్వతకి అర్థం ఏమిటి? వేదన ఎందుకు కలుగుతుంది? సంతృప్తికీ, అసంతృప్తికీ తేడా ఏమిటి? త్యాగం నిజంగా ఆనందాన్ని ఇస్తుందా? 'ఆత్మే సర్వస్వం' అని సామవేదం చెబుతోంది కదా. మరి సంతృప్తి అసంతృప్తి – ఆ సర్వస్వంలో భాగాలే కదా! ఆత్మ రెంటినీ ఒకేలా ఎందుకు స్వీకరించదు? ఒక సంఘటన, ఒక జ్ఞాపకం, ఒక కోల్పోవటం– మనిషికి ఎందుకు ఇంత వేదనని కలిగిస్తాయి?

అతడి చర్మం పికిలిపోయింది. అతడి కళ్ళు మెరుపుని కోల్పోయి శోధనని నేర్చుకున్నాయి. కుంచెని పట్టుకునే సన్నటి నాజూకు వేళ్ళమీద గోళ్ళు మరింతగా సాగాయి. చెక్కిళ్ళ పక్కనే పొడి గెడ్డం అస్తవ్యస్తంగా పెరిగింది.

అతడు వింధ్య దాటాడు. గంగలో స్నానం చేశాడు. బైరాగుల్తో కలిసి స్మశానంలో పడుకున్నాడు. కాలుతున్న శవాల్ని చూశాడు. కుంభమేళాల్లో భక్తుల్తో కలిసి పిచ్చివాడిలా తిరిగాడు. మెడిటేషన్‌లో ఈ ప్రపంచాన్నే మరచిపోవాలనుకున్నాడు. కానీ అతడికి ఈ అన్ని చర్యలూ వాస్తవం తాలూకూ నీడలుగా కనబడ్డాయే తప్ప సత్యం గోచరం కాలేదు. తాగుబోతు అయిన దేవదాసుని సగం ప్రపంచం అద్భుతమయిన ప్రేమికుడిగానూ, సగం ప్రపంచం చేతగానివాడుగానూ గుర్తించింది. మరి ఇతడిని పిచ్చివాడుగా గుర్తిస్తుందో, సత్యాన్వేషిగా గుర్తిస్తుందో కాలమే నిర్ణయించాలి. అతడు మాత్రం ప్రపంచానికీ, కాలానికీ విలువ ఇవ్వటం మానేశాడు.

అతడిది ఒకటే కోరిక!

శూన్యం అయిపోవాలని.

కలల నుంచీ, కోర్కెల నుంచీ, దాహం నుంచీ, విషాదం నుంచీ... చివరికి ఆనందం నుంచీ కూడా విముక్తం అవ్వాలని అతడు ప్రయత్నించ సాగాడు. ఒక జ్ఞాపకం తనని ఇంతగా బాధిస్తున్నదేమిటా అని ఆశ్చర్యం ఒక వైపు. ఆ అమ్మాయికీ తనకీ మధ్యనున్నదేమిటా అన్న సందిగ్ధం మరోవైపు... ఈ ద్వైదీ భావంతో అతడు ''మరణం'' అంచున నిలబడి బ్రతుక్కి అటువైపు ఏముందో చూడటానికి ప్రయత్నం చేయసాగాడు. తన నుంచి తాను విడివడి వేయి రూపాలుగా తనని

తాను చూసుకున్నాడు. మనిషి జీవితపు అస్థిత్వాన్ని తెలుసుకోవటం కోసం వేదాల్నే ఎందుకు ఆశ్రయించాలి? కోతుల్ని చూస్తే తెలియదా? అన్న వితండవాదాన్ని తర్కించుకున్నాడు. ఆ తర్కపు మొదటి విజయంగా అనూజ్ఞ సమాధిని చూడాలన్న కోర్కెను జయించాడు.

తరువాత కొంతకాలం ప్రపంచానికి సంబంధం లేకుండా ప్రపంచంలో ఉన్నాడు. సామాన్యులతో కలిసి, మామూలు స్థాయీ భావాలయిన కోపం, దుఃఖం, సంతోషం లాటి వాటిని అనుభవించాలని విఫల ప్రయత్నం చేశాడు. చిన్న రొట్టెముక్క కోసం ప్రాణాలకు తెగించి రోడ్డు పక్క పోట్లాడుకునే కుర్రవాళ్ళని చూశాడు. బిచ్చగాళ్ళ దగ్గర్నుంచి కొనుక్కునే అన్నాన్ని తూకం వేయటంలో కూడా మోసం చేసే వర్తకుల్ని చూశాడు. అయితే ఒకటి మాత్రం గమనించాడు. రక్తం తాగే కసాయి వాళ్ళయినా, డబ్బుకోసం ఏ పని చేయటానికయినా వెనుదీయని దుర్మార్గులయినా తమవాళ్ళని మాత్రం నిజాయితీగా ప్రేమిస్తారు. తమ వాళ్ళు అంటే... తమ సంతానం, బంధువులు, స్నేహితులు వగైరా...

దొంగల్లో, లంచగొండుల్లో, రౌడీల్లో, హంతకుల్లో – అందరిలోనూ తమ వాళ్ళ పట్ల ప్రేమ ఉంది. చాలామంది వ్యక్తులు ఈ ప్రపంచంలో అత్యంత గొప్ప గొప్ప పనులు చేసినా, లేక హత్యలు చేసినా, డబ్బు సంపాదించినా అది కేవలం తన వాళ్ళకోసమే. మరి ''తన'' అంటే ఏమిటి? రక్త సంబంధమా? ప్రేమ సంబంధమా? అనూజ్ఞ మరణం పట్ల కలిగిన దుఃఖం, శ్మశానంలో ఎవరిదో శవం కాలుతోంటే రాదేం? ప్రేమ కూడా స్వార్ధమేనా? అందుకేనా సిద్ధార్థుడు ప్రేమ కూడా ఒక కళ అన్నాడు.

ఈ భావం రాగానే అతడు ఇంటికి ఉత్తరం వ్రాశాడు.

కళ్యాణీ,

నేనిలా ఇల్లు వదిలి తిరగడం నీకు నా మీద కోపాన్నీ, అసహ్యాన్నీ తెప్పిస్తుందని తెలుసు. బాధనుంచి తప్పించుకోవటానికి నేను ఇలా పారిపోయి రాలేదు. ఒక సత్యం గురించి వెతుకుతూ తిరుగుతున్నాను. అది దొరికిన మరుక్షణం వస్తాను. నన్ను క్షమించు.

– కార్తికేయ

ఆ ఉత్తరాన్ని పోస్టు చేసి ఆ ఊళ్ళోనే మరో రెండురోజులు ఉండటం ద్వారా అతడు తన భార్య గురించి తక్కువ అంచనా వేశాడు. అది అందిన వెంటనే ఆమె ఏ ఊర్నుంచి వచ్చిందో కనుక్కుని, తన బలగాన్నంతా ఉపయోగించి అతని ఉనికి కనుక్కుంది. హిమాలయాల పాదాల దగ్గర ఉండే ఊరు హరిద్వార్‌లో ఉన్నాడు. ఆ ఊళ్ళో ఒక మనిషిని పట్టుకోవటం పెద్ద కష్టంకాదు.

అయితే ఆమె అతన్ని కలుసుకునే ప్రయత్నం చేయలేదు.

స్వామీ ధృవానందని పంపింది.

హరిద్వార్.

హిమాలయాలమీద పడిన ఎండ తెల్లగా మెరుస్తోంది.

పుణ్యక్షేత్రం కాబట్టి తెల్లవారుజామునే ఊరు మేల్కొంది. సత్రం అరుగుమీద పడుకొని ఉన్న కార్తికేయ, నిద్ర లేచాడు. దూరంగా కొండలమధ్య గంగానది కనపడుతోంది. జన సామర్థ్యం ఉన్న చోటుకి కాకుండా కొండల్లోకి నడిచాడు. నది అక్కడ మరింత వేగంగా పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఆ నదీజలాల్లో మొహం శుభ్రం చేసుకుని వెనుదిరుగుతూ ఆగిపోయాడు.

కొండరాళ్ళమీద స్వామి ధృవానంద నిలబడి ఉన్నాడు.

ఆ సమయంలో ఆ ప్రదేశంలో ఆయన్ని అక్కడ చూసి, విస్మయంతో ''స్వామీ మీరిక్కడా'' అన్నాడు.

''అదే ప్రశ్న నేనూ అడుగుదామనుకుంటున్నాను. ఈ బట్టలేమిటి? ధూళి నిండిన ఆకారమేమిటి? అసలు నువ్వేనా అన్న సందేహం కలుగుతోంది. కోటీశ్వరుడవయిన నువ్వు ఈ రకంగా విరాగివెందుకు అయ్యావు? ఏం జరిగింది?''

కార్తికేయ దగ్గరకొచ్చి వినమ్రంగా ''స్వామీ! 'వేదాంతం వేరు – వైరాగ్యం వేరు' అని మీరొకసారి అన్నారు గుర్తుందా. ఆ రెంటికీ తేడా తెలియజెప్పటం కోసమే 'కర్మ' నాతో ఆడుకున్నది అనుకుంటాను. అనూజ్ఞ మరణంతో అంత విషాదం కలగటం చూసి, నా మీద నాకే నమ్మకం పోయింది. భౌతికమయిన విలువలకీ, నైతికమయిన విలువలకీ తేడా తెలుసుకోవటం కోసం నేను ఇల్లు వదిలాను. నేను ఆనందం అనుకున్నది ఒక గాజు భవంతి అనీ, దాన్ని బ్రద్దలు కొట్టటానికి ఒక చిన్న రాయి అయినా చాలు – అన్న చేదునిజం నన్ను ఊరు ఊరు తిప్పుతోంది'' అన్నాడు.

''అనూజ్ఞ ఎవరు?''

అతడు మొత్తం జరిగింది చెప్పాడు. చెప్పి అన్నాడు: ''నా భార్య నాకు ఈ జనారణ్యం గురించి చెప్తూ, ఈ ప్రపంచంలో బ్రతకాలంటే అధికారం, ఆత్మవిశ్వాసం, ధనం కావాలని. ఆ మూడిటికీ మూల కారణం 'స్వార్థం' అనీ నాతోకలిసి ఉన్నన్నాళ్ళూ వాదించింది! కొన్ని లక్షల డబ్బు కోసం, ఒక అమ్మాయి ఆనందానికి నన్ను అమ్మివేసింది. మరొక స్త్రీ నాలో కళాకారుణ్ని స్పందింప జేసింది. నాకు  భార్య ఉన్నదని తెలిసీ తన ప్రేమ తగ్గించుకోలేదు. కేవలం నైతిక బాధ్యతకి విలువనిచ్చి నేను నా పరిధిలో ఉండిపోయాను. అయినా నా భార్య నన్ను అర్థం చేసుకోలేదు. నాకు నా భార్య విధానాలపట్ల అగౌరవం లేదు. నేను తెలుసుకోవాలనుకున్నదల్లా నేనేమిటి అని! నా భార్య పక్షవాతంతో పడి ఉంటే నాకు వాంఛాపూరితమైన కలలు ఎందుకొచ్చాయి? ఆమె నన్ను ఇష్టపడుతోందని తెలిసినప్పుడు నేను వివాహితుడినని మొదటి రోజే అనూజ్ఞకి ఎందుకు చెప్పి బుజువులు చూపించలేక పోయాను? నా వివాహం విషయం ఆమెకి తెలిసేలా చెయ్యాలనుకుంటే చెయ్యలేనా? నా పట్ల ఆ అమ్మాయి ఇష్టాన్నిఅంతర్గతంగా నేనూ ఇష్టపడటం నా స్వార్థం కాదా? అసలు నా భార్యని నేను ఎందుకు వివాహం చేసుకున్నాను? త్యాగం ద్వారా వచ్చే ఆనందం పొందటానికి కాక మరేదయినా కారణం

ఉన్నదా? ప్రతీ విషయంలోనూ కొన్ని పరిమితులు విధించుకుని నేను నా కోసం నిర్మించుకున్న కృత్రిమమైన సిద్ధాంతాలు నాకు నిజంగా సంతోషాన్ని ఇస్తున్నాయా? నేను చాలా గొప్పవాణ్ణన్న అహం నా చేతల్లోనూ, మాటల్లోనూ అప్పుడప్పుడు బయటపడటం లేదా? నిజంగా నేను ఏ రకంగా గొప్పవాడిని? నా భార్యలాగా తనకేం కావాలో తెలుసుకుని, దాన్ని ఏ రకంగానయినా సాధించుకోవటం నాకు తెలీదు. అనూజ్ఞలాగా ప్రేమకోసం ప్రపంచాన్ని ఎదిరించటం తెలీదు. నాకు తెలిసినదల్లా నిరంతరం ఘర్షణ పడటం.''

''ఘర్షణవల్లే మనిషి ఎదుగుతాడు నాయనా.''

''నా ఘర్షణ అంతా నిరర్థకమే. నిరర్థకమైన ఘర్షణ అనవసరం అని నా ఉద్దేశ్యం స్వామీ. అసలు ఘర్షణ అనేది ఎందుకు వస్తుంది? ఏది మంచో, ఏది చెడో తెలియకపోతే వస్తుంది. అనూజ్ఞ పట్ల నేను ఇష్టం చూపించకపోవటానికి కారణం నా భార్య పట్ల ఉన్న ప్రేమా? నైతిక విలువల పట్ల గౌరవమా? ఈ రెండు కారణాలలో ఏదైనా ఒకటయితే మంచిదే కానీ, నా తండ్రి గత చరిత్ర నాలో అంతర్గతంగా కలిగించిన భయమే నేను ఇలా ఉండటానికి కారణమైతే అంతకన్నా విచారం మరొకటి ఉండదు.''

''ఇంత లోతుగా ఆలోచించటమే నీ స్థితిని సూచిస్తుంది నాయనా. ఇంకా ఎందుకోసం నీవిలా తిరుగుతున్నావు?''

''ఒక అభిప్రాయం మెదడు నుంచి నాలుక మీదకు వచ్చేసరికి దాని అర్థం మారిపోతోంది. ఆ కారణంగానే విజ్ఞానం వేరు, మేధస్సు వేరు అవుతోంది. పుస్తకాలు చదివి గానీ, మరొకరితో చర్చించి గానీ విజ్ఞానాన్ని పెంచుకోవచ్చేమో కానీ, మేధస్సు మాత్రం తలలోంచీ, అనుభవంలోంచీ రావాల్సిందే. త్యాగంకన్నా గొప్ప ఆనందం లేదని నమ్మిన నాకు నా మేధస్సు పట్ల నాకే అపనమ్మకం కలిగింది. అందుకే ఇల్లు వదిలి బయల్దేరాను

ధృవానంద కళ్లు మూసుకున్నాడు. ఏదో ఆలోచిస్తున్నట్టు, మనో దృష్టి ఎక్కడో నిలిపినట్టు భృకుటి ముడివడింది. దూరంగా ఆలయం నుంచి వినిపిస్తూన్న భక్తిగీతం అక్కడి గాలిలో ఆర్ద్రత నింపుతోంది. కొండల్లోంచి వేగంగా వస్తున్న గంగానది గలగల చప్పుడు ఆ గీతానికి వెనుక వాద్యనాదంలా ఉంది.

కొంచెం సేపటికి ఆయన కళ్ళు తెరిచి, ''అనూజ్ఞ ఆత్మ మరణించలేదు నాయనా'' అన్నాడు. కార్తికేయ అర్థంకానట్టు చూశాడు.

''అవును. నిన్ను అమితంగా ప్రేమించిన అనూజ్ఞ, నిన్ను విడిచి వెళ్ళలేకపోయింది. ఆ ఆత్మ నీ భార్యని చేరింది. నీకు గుర్తుందా? అనూజ్ఞ మరణించిన మరుక్షణం నీ భార్యకి కాళ్ళు వచ్చాయి. అప్పటివరకూ జీవచ్ఛవంలా ఉన్న నీ భార్య ఆ క్షణం నుంచీ మామూలు మనిషి కావటానికి కారణం అనూజ్ఞ ఆత్మే...''

పర్వతంలోంచి వచ్చే ప్రత్యూషపు గాలి ఆ ప్రదేశాన్నీ, అతడి శరీరాన్నీ ఒకేసారి చుట్టు ముట్టింది. కన్నార్పటం కూడా మర్చిపోయి అతడు స్వామినే చూడసాగాడు. మనసంతా ఆర్ధ్రవం. మెదడంతా నీరవం. అనుమానం మంచుపొరలు

విడిపోతున్న భావం.. ఒక అన్వేషణకి అర్థం దొరికింది. ఒక ప్రశ్నకి సమాధానం తెలిసింది. రెండు చేతులూ జోడించి ''... నేను ఇంటికి వెళ్తున్నాను స్వామీ'' అన్నాడు.

''మంచిది'' అన్నాడు ధృవానంద. ''త్వరగా వెళ్ళు. అక్కడ నీ భార్య ఎదురుచూస్తూ ఉంటుంది. నీ ప్రియురాలు కూడా.''

కార్తికేయ సత్య శోధన పూర్తయినవాడిలా, గుట్ట దిగి, ఊరువైపు నడవసాగాడు. అటువైపే చాలాసేపు చూసి స్వామి కూడా వెనుదిరిగాడు. దూరంగా హిమాలయాలు. ఎత్తుగా... ఉన్నతంగా, మనిషి ఊహకి అందనట్టుగా. వాటిని చూస్తూంటే ఆయనకి శ్రీకళ్యాణి చెప్పిన విషయం గుర్తొచ్చింది.

సంయోగానికీ, సంగీతానికి సమయ నిర్బంధం లేదు. అందుకే రాత్రికి రాహుకాలం లేదు.

ఆ గదిలో గాలి హేమంతానికి సీమంతం చేస్తోంది. వర్షించటం కోసం యవ్వనం గ్రీష్మంలో ఘర్షిస్తోంది. వేల వేల సంవత్సరాలు బ్రతికున్న నక్షత్రం జారితే విశ్వంలో కలిసిపోతుంది. శోభనంలో జారిన మల్లె పక్క మీద నలిగి అస్థిత్వం పొందుతోంది. అనుభవం ప్రధానం కాదు. అనుభూతి ప్రధానం.

నగరాన్ని ఏలే రాజు ఏనుగుమీద వెళుతోంటే, పురజనులు భవంతుల మీదనుంచి పూలు జల్లినట్టు, మన్మథుడు గాలి తిమ్మెరల మీద కదిలొస్తుంటే కొమ్మలు కదిలి, కొమ్మలు (స్త్రీలు) పూలు జల్లినట్టుంది. రాత్రి ఒంటి గంట దాటింది. చల్లటి గాలి వీస్తోంది. వసంత ఋతువు అపుడే ప్రారంభం అయింది.

వసంత మంటేనే విరహం. మీనం వెళ్ళి మేషం రావటంతో వసంతం ప్రారంభమవుతుంది. చాలాకాలపు వియోగానికి కూడా ఇది వర్తిస్తుందేమో. మీనకేతనుడు అంటే మన్మధుడు. మన్మథుడు బాణాలు వేసి వెళ్ళిపోగానే, అగ్ని (విరహం) రావటం సహజమే కదా!

వసంతం రాగానే చెట్లు తామంతట తామే ఆకులు రాల్చేసినట్టు, చాలారోజులు ఎడబాటు తరువాత కలసిన స్త్రీ తనంతట తానే వలువలు విడిచేస్తుందట. చెట్ల మీద నుంచి నేలకు పడే ఆకుల శబ్దం ఒకదానికొకటి ఏ విధంగా పొంతన లేకుండా ఉంటుందో, సుదీర్ఘ వియోగం తరువాత పురుషుడు ప్రేమతో పెట్టుకునే ముద్దుల శబ్దం కూడా ప్రదేశాన్ని బట్టి మారుతుంది.

ఋతుచక్రం వసంతంతోనే ఆగదు కదా. వసంతం తరువాత గ్రీష్మం. గ్రీష్మంలో ఎండిపోకుండా ఉండటం కోసం నదులు, తమ చివర్లయిన సముద్రాల్నుంచి చెమ్మని మేఘాలకి అరువిచ్చి, తమ మొదళ్ళయిన పర్వత ప్రాంతాల్ని తడపమంటాయి. నదిలాటి స్త్రీ కూడా తన స్థనాలపై చుంబనపు తడికోసం లోయల్లోంచి నీటిని పురుషుడికి అరువిస్తుందేమో. గ్రీష్మం తరువాత వర్షమే. మృగశిర వచ్చిందంటే, మేఘాల్ని చూసి నెమళ్ళు నాట్యం చేయటం మొదలుపెడతాయి. నెమళ్ళ

దృష్టి నాట్యం మీద ఉండటంతో, శత్రు భయం పోయిన పాములు విజృంభిస్తాయి. ఆ తరువాత వచ్చేది హేమంతం. చలికి పాములు పుట్టల్లోనూ, మోములు వధూకుచ మధ్యమంలోనూ విశ్రమిస్తాయి.

అర్ధరాత్రి దాటి రెండు గంటలైంది. హఠాత్తుగా నిద్రలోంచి మెలకువ వచ్చిన శ్రీకళ్యాణి పక్కనే కార్తికేయ లేకపోవడంతో, లేచి బయటకు వచ్చింది. రెయిలింగ్‌కి ఆనుకొని నిలబడి చీకట్లోకి చూస్తున్నాడు. దగ్గరకు వెళ్ళి పక్కనే నిలబడింది.

ఇద్దరూ కొంచెం సేపు అలా నిలబడ్డాక, ఆ మౌనం భరించలేనట్టు, అతడి చేయి మీద చెయ్యివేసి, ''... బాధపడుతున్నారా'' అని అడిగింది.

అతడు గాఢంగా నిశ్వసించాడు. ''నేను బాధపడుతున్న మాట నిజమే కానీ నా బాధకి కారణం అనూజ్ఞ మరణంకాదు కళ్యాణీ''.

శ్రీకళ్యాణి అమితమైన ఆశ్చర్యంతో, ''మరెందుకు?'' అంది.

అతడు చెప్పటానికి సంశయించాడు. చెప్తే అర్థమవుతుందా? కానీ చెప్పక తప్పదు. ఇంతకాలం తెరలు ఎలాగూ తప్పలేదు. ఇప్పుడన్నా వాటిని తొలగించాలి.

అతను అన్నాడు. ''ఏ మాత్రం విజ్ఞతలేని వాడిలా, ఎవరితో చెప్పకుండా ఇంటినుంచి వెళ్ళిపోవటం గురించి. ఇంతకాలం నేను నిజం అనేది ఒకటున్నదని నమ్ముతూ వచ్చాను. కానీ నిజానికి అవతలివైపు ఉన్నది కూడా 'నిజమే' అని నాకు అర్థమైంది. అందుకే ఈ ప్రపంచంలో అబ్‌సొల్యూట్ నిజం అంటూ ఏమీలేదు.''

''మీరు ఏ నిజం గురించి మాట్లాడుతున్నారు?''

''నీ గురించే...'' అతనన్నాడు. ''ఇంతకాలం 'నేను' నిజమనీ, నువ్వు 'అబద్ధమనీ' అనుకుంటూ వచ్చాను. ఇప్పుడు నువ్వు కూడా నిజమన్న విషయం తెలుసుకున్నాను. ఇతరుల నుంచి తమకు కావల్సింది అధికారంతో, ఆత్మవిశ్వాసంతో తీసుకోగలిగినవారే... అంత నిస్వార్థంతో, అంత సంతోషంతో ఇతరుల కివ్వగలరని నా శోధనలో అర్థమైంది''.

కళ్యాణి నవ్వింది. ''ఆ రోజుల్లో గౌతముడికి బోధివృక్షం క్రింద జ్ఞానోదయం అయిందట. మరి మీకెలా అయింది?'' అంది నవ్వుతూ.

''అనూజ్ఞ ఆత్మ గురించి నువ్వు చెప్పించిన అబద్ధాన్ని స్వామీ ధృవానంద చిలుక పలుకుల్లా నాకు అప్పజెచెప్పినప్పుడు.''

ఆమె స్థాణువై, కొంచెం సేపటికి సర్దుకుని, ''నేనే అలా చెప్పించానని మీకెలా తెలిసింది?'' అని అడిగింది.

అతడామె ప్రశ్నకి సమాధానం చెప్పకుండా కొనసాగించాడు. ''...నేను అనూజ్ఞ కోసం పిచ్చివాడిని అయ్యాననుకుని, అనూజ్ఞ నీలోనే ఉందని చెప్పించావు. అంటే నేను నీతో గడుపుతూ, ఆమెతో ఉంటున్నానన్న సంతోషాన్ని నాకు జీవితాంతం

కలిగించే ఏర్పాటు చేశావు. తల్చుకుంటేనే నా కళ్ళు నీటితో నిండుతున్నాయి. ఏ భార్యా తన భర్తకు చేయని పని నువ్వు జేశావు. చాలా సులభంగా, చాలా మామూలుగా నువ్వు నాతో రమించావు. నువ్వు ధృవానందతో చెప్పినదంతా నేను నిజంగా నమ్మి ఉంటే, ఈ రాత్రి నేను చేసింది మానసిక వ్యభిచారమై ఉండేది. దాన్నికూడా నువ్వు చాలా మామూలు విషయంగా భావించావు. నీకు కావల్సింది నువ్వు ఎంత గొప్పగా తీసుకోగలవో, అంత గొప్పగానూ అవతలి వాళ్ళకు కావల్సింది వాళ్ళకు ఇవ్వగలవు. నేనలా కాదు. నేనొక ఎగ్జిబిషనిష్టుని. నా పనులన్నిటినీ ఏదో ఒక సమయంలో ఎవరో ఒకరు గుర్తించాలన్న ఆశ నాలో అంతర్గతంగా ఉన్నదేమో. వాదనల ద్వారా దాన్ని వెల్లడిస్తూ ఉండడం దానికి ఉదాహరణ. అయితే నా పనులన్నిటిలోనూ నాకు 'మంచితనపు సంతృప్తి' మాత్రమే ఉండేది కానీ నిజమైన మానసిక సంతృప్తి ఉండేది కాదు. ఇంతకాలం ఇతరుల్ని సంతోషపెట్టడంలోనే ఆనందం ఉందనుకునేవాడిని. మనం సంతోషించటంలో కూడా ఆనందం ఉందని నాకు తెలిసింది.''

''కానీ...''

''ఆగు కళ్యాణీ నన్ను చెప్పనీ. ఈ రాత్రి నా మనసు విప్పనీ...'' చీకట్లోంచి దృష్టి ఆమె మీదకు మరలుస్తూ అన్నాడు కార్తికేయ. ''...పూర్వకాలంలో కళాకారులు తమ జీవన భృతికోసం ఏ పనీ చేసేవారు కాదు. సమస్యలను మనసుకు పట్టించుకోకుండా ప్రకృతి నుంచో, పడతి నుంచో ప్రేరణ పొందుతూ, అలౌకికమైన స్థితిలో బ్రతికేవారు. ఇలాంటి వారందరికీ సుస్థిరత కల్పించడం కోసం రాజులు ఒకవైపు యుద్ధాలు చేస్తూ, మరొక వైపు కళలను పోషించేవారు. మారుతున్న కాలంలో కళాకారుడు తన బ్రతుకు కోసం సంపాదిస్తూ, మరోవైపు కళాపిపాసని పెంచుకోవలసిన స్థితి ఏర్పడింది. అందుకే కళ చచ్చిపోతోంది. నిజమైన కళాకారుడు ఏ సమస్య ఎదురైనా తల్లడిల్లిపోతాడు. ఏకాగ్రత నశిస్తుంది. ఆ విషయం నువ్వు గ్రహించావు. అనూజ్ఞ నా ప్రేరణ అని నీకు తెలుసు. అందుకే ఓ రాజులాగా నాకు మానసికంగా రక్షణ కల్పించ బూనావు. అనూజ్ఞని నీలోకే ఆపాదించుకుని, నాకు ప్రేరణ కొనసాగించ బోయావు. ఆ రకంగా నువ్వు నాకు బోధి వృక్షానివయ్యావు కళ్యాణీ! ఏ నిరంతర అన్వేషణలోనూ దొరకని సత్యం... చివర్లో నాకు నీ దగ్గరే దొరికింది.'' అతడు మోకాళ్ళ మీద కూర్చుని ఆమె కాళ్ళచుట్టూ చేయివేసి, ఆర్తిగా కడుపుమీద తల ఆన్చి కళ్ళు మూసుకున్నాడు.

ఆమె అతని జుట్టులోకి వేళ్ళు జొనిపి, నెమ్మదిగా రాస్తూ అలాగే చాలాసేపు ఉండిపోయి ''నేను మీకో విషయం చెప్పనా?'' అంది.

అతడు తలెత్తి ఏమిటన్నట్టు చూశాడు.

''అనూజ్ఞ బ్రతికే ఉంది.''

ఆ మరుసటిరోజు బాగా ప్రొద్దుపోయాక ఫోన్ వచ్చింది. ''నేనూ అనూజ్ఞని...'' అట్నుంచి వినపడింది. ''కార్తికేయ వచ్చేశాడటగా'' ఎగ్జయిటింగ్‌గా అడిగింది.

''అవును'' అంది కళ్యాణి.

''హమ్మయ్య. ఏమయ్యాడో అని ఇంతకాలం కంగారుపడ్డాను. ఎక్కడికి వెళ్ళేడట?''

''దానికేం గానీ నీ ఆరోగ్యం ఎలా ఉంది? ఎక్కడనుంచి మాట్లాడుతున్నావు. నువ్వు?''

''లండన్ నుంచి. ఇక్కడే మంచి ట్రీట్‌మెంట్ దొరుకుతుంది. ఫర్వాలేదన్నారు డాక్టర్లు. అన్నట్లు ఆ సత్యం, ప్రతాపరెడ్డి మరణాల గురించి ఎవరికయినా అనుమానం వచ్చిందా?''

''లేదు. ఇద్దరికీ ఏదో దెయ్యం పట్టిందనుకుంటున్నారు అందరూ''

అట్నుంచి అనూజ్ఞ నవ్వింది. ''ఓకే... నేనిక ఫోన్ చెయ్యను. ఇదే ఆఖరి ఫోన్. నా ప్రసక్తి కార్తికేయ దగ్గర తీసుకు రావద్దని నాన్నగారికి కూడా చెప్పాను. మళ్ళీ అతనికి అశాంతి కలుగచేయటం నా కిష్టంలేదు. అన్నట్టు నేనొకటి చెప్పనా?''

''చెప్పు''.

''ఈ ప్రపంచంలో మంచి మగవాళ్ళు చాలామంది ఉండొచ్చు కానీ మంచి భర్తలు మాత్రం చాలా తక్కువ.''

''నీకెలా తెలిసిందో గానీ, మంచి కొటేషన్'' అంది శ్రీకళ్యాణి. ''మరి ఉండనా?''

''ఉంటాను. బై... బై ఫరెవర్''

ఫోన్ పెట్టేస్తూ 'నిజమే, మంచి భర్తలు చాలా తక్కువ. ఆ విధంగా అదృష్టవంతురాల్ని. అందువల్లే నువ్వు బ్రతికే ఉన్నావన్న సంగతి నా భర్త దగ్గర దాచి ఉంచలేక పోయాను. నువ్వు మరణించావన్న ఉద్దేశ్యంతో అతడు నిన్ను మళ్ళీ కలుసుకునే ప్రయత్నం చేయటం లేదన్న భావం నీకు సంతృప్తినిస్తోంది కదా. నువ్వా సంతృప్తిలోనే ఉండు అనూజ్ఞా' అనుకుంది మనసులో.

(సమాప్తం)

Click here to share your comments